క్లుప్తంగా

నేటి నుంచి పాఠశాలలకు సెలవులు



మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లా వ్యాప్తంగా వివిధ ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలకు నేటి నుంచి ప్రభుత్వం సెలవులు ప్రకటించింది. దీంతో అన్ని పాఠశాలలు, హాస్టల్స్, గురుకులాలు అన్ని మూగబోనున్నాయి. జూన్ 12వ తేదీ నుంచి మళ్లీ పునః ప్రారంభం కానున్నాయని డీఈఓ ప్రవీణ్‌కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ క్రమంలో జిల్లా కేంద్రంలోని దొడ్డ లోనిపల్లిలో, టీడీగుట్ట పాఠశాలలో విద్యార్థులకు గ్రాడ్యుయేషన్ డే నిర్వహించగా, డీఈఓ ప్రవీణ్‌కుమార్ హాజరై విద్యార్థులకు ప్రొగ్రెస్ కార్డులు అందచేశారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు విద్యా శంకరభారతి మహాస్వామి ప్రసంగం

జడ్చర్ల టౌన్: జగద్గురు పుష్పగిరి శంకరాచార్య మహాసంస్థాన పీఠాధిపతి విద్యాశంకర భారతి మహాస్వామి గురువారం సాయంత్రం పట్టణానికి రానున్నట్లు సభ నిర్వాహకులు బీ శివకుమార్ తెలిపారు. పట్టణంలోని చంద్రగార్డెన్‌లో సాయంత్రం 6గంటల నుంచి స్వామి అనుగ్రహభాషణం (ప్రసంగం) ఉంటుందని ఆయన తెలిపారు. కార్యక్రమానికి పెద్ద సంఖ్యలో పట్టణవాసులు హాజరు కావాలని పిలుపునిచ్చారు.

ఫీల్డ్ అసిస్టెంట్ కుటుంబానికి పరామర్శ



మహబూబ్‌నగర్ రూరల్: మండలంలోని గాజులపేట గ్రామానికి చెందిన ఫీల్డ్ అసిస్టెంట్ తిరుపతయ్య అనారోగ్యంతో మృతి చెందాడు. ఈ విషయం తెలుసుకున్న ఎంపీడీఓ కరుణశ్రీ బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించారు. తక్షణ సాయంగా రూ.20 వేలు అందజేసి, మిగతా రూ.2 లక్షలు ప్రభుత్వం ద్వారా ఇప్పించేలా చూస్తానని బాధిత కుటుంబ సభ్యులకు మనోధైర్యం కల్పించారు. ఎంపీడీఓ వెంట ఈసీ అమ్జద్, టెక్నికల్ అసిస్టెంట్ కరుణాసాగర్, వెంకటేశ్వర్‌రెడ్డి, రాజురెడ్డి, కవిత, ఇతర గ్రామాల ఫీల్డ్ అసిస్టెంట్లు ఉన్నారు. తిరుపతయ్యకు ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు.

మున్సిపల్ కమిషనర్‌కు ఫిర్యాదు

జడ్చర్ల టౌన్: పట్టణంలోని 12వ వార్డు మోర్ సూపర్ మార్కెట్ పక్కన మోరీని కూల్చేందుకు కొందరు ప్రయత్నిస్తున్నారని, దానిని నియంత్రించాలని శ్రీనివాసనగర్ కాలనీకి చెందిన కొందరు మహిళలు బుధవారం మున్సిపల్ కమిషనర్ కార్యాలయంలో వినతిపత్రం సమర్పించారు. మోరీ నిర్మాణం చేసిన స్థలం ఆక్రమించేందుకు యత్నిస్తున్నారని తెలిపారు. ఎలాంటి అనుమతి లేకుండా మోరీలో ఫిల్లర్ నిర్మాణం చేశారని, ఇప్పుడు ఏకంగా మోరీని తొలగించేందుకు కుట్రలు పన్నుతున్నారని పేర్కొన్నారు. మొదటి లేఅవుట్ ప్రకారం ప్రస్తుతం ఉన్న మోరీ నిబంధనల మేరకు ఉందని, అలాంటిది దాన్ని తొలగిస్తే వరదలు వచ్చిన సమయంలో ఇబ్బందులు వస్తాయని వివరించారు. వినతిపత్రం పొందుపర్చిన వారిలో రాధిక, రాజమణి, బుజ్జిలు ఉన్నారు.

కానిస్టేబుల్ కుటుంబానికి రూ.8లక్షల చెక్కు అందజేత



మహబూబ్‌నగర్ క్రైం: పోలీస్ శాఖలో ఏఆర్ కానిస్టేబుల్‌గా పని చేస్తున్న వెంకటేష్ ఇటీవల డ్యూటీలో గుండెపోటుతో మరణించగా భద్రత నిధి నుంచి రూ.8లక్షల చెక్కును బుధవారం ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ డి.జానకి బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ఎప్పుడు మద్దతుగా ఉంటామని తెలిపారు. కార్యక్రమంలో ఏఓ రుక్మిణి పాల్గొన్నారు.

నేడు భూ భారతి అవగాహన సదస్సు

కోయిల్‌కొండ: మండల కేంద్రంలోని రైతువేదికలో గురువారం నిర్వహించే భూ భారతి అవగాహన కార్యక్రమానికి కలెక్టర్ విజయేందిర బోయి, నారాయణపేట ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి హాజరవుతారని కాంగ్రెస్ మండల నాయకులు ఒక ప్రకటనలో తెలిపారు. అనంతరం అర్హులైన కల్యాణలక్ష్మి, షాదీముబారక్ చెక్కులు లబ్ధిదారులకు ఎమ్మెల్యే అందించనున్నట్లు పేర్కొన్నారు.

‘ఉపాధి’లో కందకాల నిర్మాణం

- జోరుగా కందకాలు, ఫారంపండ్స్ తవ్వకాలు
- మండలంలో 126 అనుమతి
- చురుకుగా 56 ఫారంపండ్స్ పనులు

నవాబుపేట: ఉపాధి హామీలో ఫారంపండ్లు, కందకాలు ఊరూరా జరుగుతున్నాయి. భూగర్భ జలాలు పెంపొందించేందుకు ఫారంపండ్స్, కందకాల ఏర్పాటుకు అధికారులు ప్రణాళికలు సిద్ధం చేసి ఉపాధి ద్వారా రైతుల పొలాల్లో చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. కొన్ని గ్రామాల్లో అంతంతే జరిగిన చాలా గ్రామాల్లో మాత్రం ఫారంపండ్స్ పనులు జోరుగా సాగుతున్నాయి. మండలంలో నేటికీ 126 ఫారం పండ్స్ ఏర్పాటుకు అధికారులు ప్రతిపాదనలు సిద్ధం చేసి పనులు ప్రారంభిస్తే 56 ఫారం పండ్స్ ముమ్మరంగా నిర్వహిస్తున్నారు. గ్రామాల శివారులో ఉన్న గుట్టల చెంత కందకాల తవ్వకాలు సైతం ముమ్మరమయ్యాయి. మండలంలో మొత్తం 9525 జాబ్ కార్డులు ఉండగా, తాజాగా 3087 మంది కూలీలు పని చేస్తున్నారు. తాజాగా కూలి సైతం ఒక్కొక్కరికి రూ.220 నుంచి రూ.280 వరకు గిట్టుబాటు అవుతోంది. దీంతో ఉపాధి కూలీలు చురుకుగా పనులు చేస్తున్నారు.



నవాబుపేటలలో ఫారంపండ్ తవ్వుతున్న ఉపాధి కూలీలు



హజిలాపూర్‌లో కందకాలు ఏర్పాటు చేసిన కూలీలు

348 కుటుంబాలకు 100 రోజులు పూర్తి

భూగర్భ జలాలు పెంపొందించే పనులకు మొదటి ప్రాధాన్యత ఇస్తున్నాం. గత ఆర్థిక సంవత్సరంలో 348 కుటుంబాలకు సంబంధించి వంద రోజుల పని పూర్తి అయ్యింది. వారిలో ఎక్కువగా ఫారం పండ్లు చేసిన కూలిలే. తాజాగా ఎక్కువ కూలీలు నవాబుపేట, పోమాల్, కొత్తపల్లి, హజిలాపూర్, ఇప్పటూర్, గురుకుంట గ్రామాల్లో ఎక్కువగా వస్తున్నారు. మండలంలో 60 శాతం కూలీలు వస్తున్నారు. దీన్ని మరింత పెంచేలా ప్రణాళికలు సిద్ధం చేసి పనులు ముమ్మరం చేస్తున్నాం.

– జ్యోతి, ఏపీఓ నవాబుపేట

పండించిన ప్రతి గింజను కొంటాం



వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

- ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి

మహబూబ్‌నగర్ రూరల్: రైతులు పండించిన ప్రతి గింజను కొంటామని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్ రెడ్డి అన్నారు. వ్యవసాయ మార్కెట్‌లో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆయన ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ రైతు సంక్షేమానికి ప్రజా ప్రభుత్వం పెద్దపీట వేసిందన్నారు. ఎన్నికల సందర్భంగా ఇచ్చిన మాట ప్రకారం రైతులకు ఏకకాలంలో రూ. 2లక్షల రుణమాఫీ చేశామని గుర్తుచేశారు. కార్యక్రమంలో జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ మల్లు నర్సింహారెడ్డి, మార్కెట్ కమిటీ చైర్మన్ బెక్కరి అనిత, వైస్ చైర్మన్ పెద్ద విజయ్‌కుమార్, డీసీసీబీ వైస్ చైర్మన్ వెంకటయ్య, కార్యదర్శి భాస్కర్, మండల ఓబీసీ సెల్ చైర్మన్ రాజుగౌడ్, డైరెక్టర్లు వెంకటాద్రి, అచ్చెన్న, రామకృష్ణ, శంకర్‌నాయక్, సయ్యద్ మజీద్, భగవంతు పాల్గొన్నారు.

కరాటే శిక్షణ శిబిరం సద్వినియోగం చేసుకోవాలి

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: వేసవి కరాటే శిక్షణ శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. కింగ్ షోటోకాన్ కాటేదూ ఇండియా ఆధ్వర్యంలో మే 4నుంచి జూన్ 1 వరకు జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న ఈ శిబిరాల బ్రోచర్‌ను ఎమ్మెల్యే ఆవిష్కరించారు.

రామకృష్ణ సేవా సమితి సేవలు అభినందనీయం

రామకృష్ణసేవా సమితి సేవలు అభినందనీయమని ఎమ్మెల్యే అన్నారు. పదోతరగతి పూర్తి చేసిన విద్యార్థులకు రామకృష్ణ సేవాసమితి, వందేమాతరం ఫౌండేషన్ (వీఎంఎఫ్) సంయుక్త ఆధ్వర్యంలో ఉచితంగా పాలిటెక్నిక్ ఎంట్రెన్స్ టెస్ట్ కోసం ఇస్తున్న శిక్షణ తరగతులను ఎమ్మెల్యే పరిశీలించారు. అంతకుముందు విద్యార్థులకు భోజనం వడ్డించి వారితో కలిసి మధ్యాహ్న భోజనం చేశారు. కార్యక్రమంలో డీసీసీ ప్రధాన కార్యదర్శి సిరాజ్‌ఖాద్రీ, డీఐఈఓ కౌసర్‌జహాన్, ప్రిన్సిపాల్ భగవంతచారి, మఠం పర్యవేక్షకులు రాజ్‌మల్లేష్, రవీంద్ర ఉన్నారు.

హన్సికకు అభినందనలు

జిల్లా కేంద్రానికి చెందిన తోకల హన్సిక ఇటీవల కూచిపూడి నృత్యంలో గిన్నీస్‌బుక్ ఆఫ్ రికార్డ్స్ సాధించడంతో ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డిని క్యాంపు కార్యాలయంలో బాలిక తన తల్లితో పాటు కలిసింది. ఈ సందర్భంగా చదువులోనూ బాగా రాణించాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.

విధి నిర్వహణలో మెరుగ్గా పని చేయాలి



శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న జిల్లా అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): విధి నిర్వహణలో మెరుగ్గా పని చేయాలని జిల్లా అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్ అన్నారు. బుధవారం మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో స్థానిక కలెక్టరేట్‌లో మినీ ప్రాంతీయ శిక్షణ కేంద్రంలో పంచాయతీ కార్యదర్శులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉద్యోగ నిర్వహణలో నేర్చుకున్న విషయాలు మరింత మెరుగ్గా పని చేసేందుకు ఉపయోగపడతాయని పంచాయతీ కార్యదర్శులు శిక్షణ తీసుకోవడం వల్ల వారికి తెలియని విషయాలు తెలుసుకోవచ్చన్నారు. రోజువారి ఉద్యోగంలోని సవాళ్లను అధిగమించేందుకు ఈ శిక్షణ వారికి ఎంతో ఉపయోగపడుతుందన్నారు. రిసోర్స్ పర్సన్ పి.కృష్ణ రిటైర్డ్ డీపీఓ, అడ్డాకల్ ఎంపీడీఓ విజయ్ కుమార్, జడ్చర్ల మండలం ఎల్లూరు గ్రామ పంచాయతీ కార్యదర్శి శ్రీకాంత్ రెడ్డి శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న 35 మంది పంచాయతీ కార్యదర్శులకు రెండు రోజుల శిక్షణ ఇచ్చారు. మొదటి రోజు సమాచార హక్కు చట్టం–2005, పంచాయతీ కార్యదర్శి పాత్ర, గ్రామ సభ సమాచార హక్కు, తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం–2018, వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చారు. ఈ శిక్షణలో జిల్లా పంచాయతీ అధికారి పార్థ సారథి, ప్రాంతీయ శిక్షణ కేంద్రం మేనేజర్ హనుమంతు, పంచాయతీ సెక్రటరీలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభం

నవాబుపేట: మండలంలోని లోకిరేవు, కూచూర్ గ్రామాల్లో బుధవారం ధాన్యం కొనుగోలు కేంద్రాలను మార్కెట్ చైర్మన్ లింగం, కాంగ్రెస్ నాయకులు దుశ్యంత్‌రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా రైతులకు ధాన్యం విక్రయాల్లో ఇబ్బందులు రావద్దని, అందుబాటులో ఉండేలా మారుమూల గ్రామాల్లో సైతం ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించామన్నారు. అనంతరం పోమాల్ గ్రామానికి చెందని బోయిని శివకుమార్‌కు సీఎం రిలీఫ్ ఫండ్ ద్వారా రూ.50 వేల చెక్కును అందించారు. కార్యక్రమంలో భూపాల్‌రెడ్డి, రమేష్‌గౌడ్, శ్రీహరి, నరేష్, ఖాజామైనొద్దీన్, కృష్ణగౌడ్, సురేందర్ ఉన్నారు.

ఇప్పటూర్ పాఠశాలకు సోలార్ ప్లాంట్ అందజేత



నవాబుపేట: మండలంలోని జెడ్పీపాఠశాలకు సెంబ్ కార్ప్ గ్రీన్ ఇన్ఫ్ అనే సంస్థ సోలార్ ప్లాంట్‌ను పాఠశాలకు అందించింది. ఈ సందర్భంగా బుధవారం 5 కిలోవాట్ సామర్థ్యంతో పాఠశాలలో అన్ని అవసరాలకు ఉపయోగపడేలా ప్లాంటును ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామకృష్ణకు ప్లాంటును అందించారు. అనంతరం దాతలకు పాఠశాల ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో సంస్థ నిర్వాహకులు ప్రగ్నేష్, ఈశ్వర్, హరిబాబు, నవీన్, పాఠశాల బృందం వజ్రలింగం, నారాయణచారి, శ్యాంప్రసాద్, క్రాంతికిషోర్ పాల్గొన్నారు.

క్వారీల్లో ఈతకు వెళ్లకుండా చూడండి

బిజినేపల్లి: వట్టెం జలాశయం పరిధిలోని క్వారీల్లో నీళ్లు ఉండటంతో చుట్టు పక్కల గ్రామాల నుంచి పిల్లలు, యువకుల ఈత కోసం వస్తున్నారని వారిని రాకుండా చూడాలని బుధవారం హెచ్‌ఈఎస్ కంపెనీ ప్రతినిధులు బిజినేపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. గతంలో క్వారీల్లో ఈత కోసం వచ్చిన వారిలో కొందరు మృత్యువాత పడ్డారని, దానిని దృష్టిలో ఉంచుకుని ఈతకు రాకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇప్పటికే ప్రమాద సూచిక బోర్డులు ఏర్పాటు చేశామని, అయినా యువత వాటిని పట్టించుకోకుండా వస్తున్నారని పేర్కొన్నారు.

నిబంధనల ప్రకారం నిర్మిస్తేనే బిల్లు



నవాబుపేటలో మాట్లాడుతున్న మండల ప్రత్యేక అధికారి సుదర్శన్

నవాబుపేట: ప్రభుత్వం నిరుపేదలకు అందించిన ఇందిరమ్మ ఇళ్లు నిబంధనల ప్రకారం నిర్మించాలని మండల స్పెషల్ అధికారి సుదర్శన్ తెలిపారు. బుధవారం మండల కేంద్రంలోని మండల అధికారులు, గ్రామాల స్పెషల్ అధికారులతో కలిసి ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం లబ్ధిదారులకు ప్రత్యేకంగా ఇచ్చిన సూచనలు అనుసరించాలని ఆయన వివరించారు. మండల అధికారులు, గ్రామ అధికారులు సైతం లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. ఇళ్ల నిర్మాణం పూర్తి చేస్తున్న తరుణంలో విడతల వారీగా బిల్లులు నేరుగా లబ్ధిదారుని ఖాతాలో జమ అవుతాయని ఆయన వివరించారు.

మండల ప్రత్యేకాధికారిగా సుదర్శన్..

మండల స్పెషల్ అధికారిగా ఉన్న కోఆపరేటివ్ అధికారి శంకరాచారి స్థానంలో కొత్తగా సోషల్ వెల్ఫేర్ డిపార్టుమెంట్ డీడీ సుదర్శన్‌ను నియమించినట్లు ఎంపీడీఓ జయరాంనాయక్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన బుధవారం మండల బాధ్యతలు స్వీకరించారు.

నర్సరీలపై ప్రత్యేక శ్రద్ధ అవసరం



రుద్రారంలో నర్సరీని పరిశీలిస్తున్న ముసాయిదా

నవాబుపేట: నర్సరీలపై ప్రత్యేక శ్రద్ధ అవసరమని అడిషనల్ డీఆర్డీఓ ముసాయిదా తెలిపారు. బుధవారం మండలంలోని రుద్రారం, యన్మన్‌గండ్ల, కాకర్లపహాడ్ గ్రామాల్లో నర్సరీలను ఆమె మండల అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా నర్సరీలను నిరంతరం పర్యవేక్షణ చేయాలని సూచించారు. తాజాగా ఎండల వేడిమిని దృష్టిలో ఉంచుకుని ప్రత్యేక చర్యలు చేపట్టి నర్సరీల నిర్వహణ చేయాలని ఆమె వివరించారు. మండల స్థాయి, గ్రామస్థాయి అధికారులు నిత్యం పర్యవేక్షణ చేసి మొక్కల పెంపకం చేయాలన్నారు. మొక్కల పెంపకంలో నీటి కొరత ఉంటే ట్యాంకర్ల ద్వారా నీటిని అందించాలన్నారు. కార్యక్రమంలో మండల అధికారులు ఎంపీడీఓ జరాంనాయక్, ఏపీఓ జ్యోతి, తదితరులు ఉన్నారు.



పాలమూరులో దిష్టిబొమ్మను దహనం చేస్తున్న బీజేవైఎం నాయకులు



మిడ్జిల్ మండల కేంద్రంలో ఉగ్రవాదుల దిష్టిబొమ్మ దహనం చేస్తున్న నాయకులు



జడ్చర్లలో వీహెచ్‌పీ నాయకులు కొవ్వొత్తుల ర్యాలీ

‘ఉగ్ర’దాడి మృతులకు నివాళి

- కొవ్వొత్తులతో నిరసన ర్యాలీలు
- దిష్టిబొమ్మలు దహనం
- ఉగ్రవాదులను హతమార్చాలని డిమాండ్

సాక్షి, నెట్‌వర్క్: జమ్మూ కశ్మీర్‌లోని పహల్‌గావ్ ప్రాంతంలో టూరిస్టులపై జరిపిన ఉగ్రవాద దాడులను నిరసిస్తూ బీజేపీ, బీజేవైఎం, ఏబీవీపీ పాలమూరు శాఖ ఆధ్వర్యంలో పాలమూరు పట్టణంలోని తెలంగాణ చౌరస్తాలో ఉగ్రవాద దిష్టిబొమ్మ దహనం చేశారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి మాట్లాడారు. పాకిస్తాన్ మద్దతుతో నడుస్తున్న ఉగ్ర వాద సంస్థల కుట్రలను తిప్పికొట్టాలన్నారు.

- మిడ్జిల్ మండల కేంద్రంలో ఉగ్రదాడికి నిరసనగా బీజేవైఎం ఆధ్వర్యంలో దిష్టిబొమ్మ దహనం చేశారు. బీజేవైఎం మండల అధ్యక్షుడు అంజి మాట్లాడారు.
- జడ్చర్ల పట్టణంలో ఉగ్రదాడికి నిరసనగా ప్రాణాలు కోల్పోయిన వారి ఆత్మకు శాంతి చేకూరాలని వీహెచ్‌పీ ఆధ్వర్యంలో పట్టణంలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అంబేడ్కర్ చౌరస్తా నుంచి ర్యాలీగా నేతాజీ చౌరస్తాకు చేరుకున్నారు. దాడులకు పాల్పడిన ఉగ్రవాదులను హతమార్చాలని నినదించారు.
- కోయిల్‌కొండ మండల కేంద్రంలో ఉగ్రదాడికి నిరసనగా బీజేపీ నాయకులు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. ఉగ్రవాదులను వెంటనే హతమార్చాలని కోరారు.
- చిన్నచింతకుంట మండల కేంద్రంలో ఉగ్రవాదుల దాడిలో మృతులకు కొవ్వొత్తులతో ఘనంగా నివాళులర్పించారు. కుర్వ రమేష్, గ్రామస్తులు పాల్గొన్నారు.
- నవాబుపేట మండల కేంద్రంలో వివిధ యువజన సంఘాలు, వ్యాపార సంఘాలు, సంఘప రివార్ సభ్యులు అంబేడ్కర్ చౌరస్తాలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించి నివాళులర్పించారు.

ఉగ్రవాదుల దాడి హేయమైన చర్య

- కశ్మీర్ అనంత్‌నాగ్ జిల్లాలో పర్యాటకులపై ఉగ్రవాదుల చేసిన దాడి హేయమైయిందని టీజేఏ జిల్లా అధ్యక్షుడు విజయ్‌కుమార్, కార్యదర్శి వరప్రసాద్ ఒక ప్రకటనలో తెలిపారు.

ఉగ్రవాదుల దాడి బాధాకరం

- జమ్మూ కశ్మీర్‌లో పర్యాటకులపై ఉగ్రవాదులు చేసిన దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామని పాలమూరు అధ్యయన వేదిక ఉమ్మడి జిల్లా కన్వీనర్ రాఘవాచారి ఒక ప్రకటనలో తెలిపారు.



కోయిల్‌కొండలో కొవ్వొత్తులతో ర్యాలీ



చిన్నచింతకుంటలో నివాళులర్పిస్తున్న గ్రామస్తులు

వాగ్దేవి విద్యార్థులను అభినందించిన ఎమ్మెల్యే యెన్నం



వాగ్దేవి కళాశాల విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్యే యెన్నం

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: ప్రభుత్వం విడుదల చేసిన ఇంటర్ మొదటి, రెండో సంవత్సర ఫలితాల్లో రాష్ట్ర స్థాయిలో సత్తాచాటిన జిల్లా కేంద్రంలోని వాగ్దేవి కళాశాల విద్యార్థులను ఎమ్మెల్యే యెన్నం శ్రీనివాస్‌రెడ్డి బుధవారం క్యాంపు కార్యాలయంలో అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు కష్టపడి చదివి మంచి ర్యాంకు లు సాధించి జిల్లాకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని సూచించారు. కార్యక్రమంలో వాగ్దేవి కళాశాల కరస్పాండెంట్ వెంకట్‌రెడ్డి, ప్రిన్సిపాల్ గీతాదేవి, జ్యోతినందన్‌రెడ్డి, శివకుమార్, రాఘవేందర్ రావు, విద్యార్థులు, అధ్యాపకులు ఉన్నారు.

అభిమన్యుడి సేవలు అభినందనీయం



రాజాపూర్‌లో విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ చేస్తున్న అభిమన్యురెడ్డి, ప్రభాకర్‌రెడ్డి

రాజాపూర్: ఆపదలో ఉన్నవారికి నేనున్నానంటూ ఆపద్బాంధవుడిలా, పేదింటి పెళ్లి కూతుళ్లకు మేనమామలా, రాజాపూర్, బాలానగర్ మండలాల్లోని గ్రామాల్లో బాధిత కుటుంబాలకు భరోసా అందిస్తూ సమాజసేవలో ముందుంటున్న బీఆర్ఎస్ నాయకులు, మాజీ ఎంపీటీసీ అభిమన్యురెడ్డి సేవలు అభినందనీయమని ఉమ్మడి జిల్లా డీసీఎంఎస్ చైర్మన్ ప్రభాకర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం దొండ్లపల్లి మాజీ ఎంపీటీసీ అభిమన్యురెడ్డి పుట్టినరోజు కార్యక్రమం కార్యకర్తలు, అభిమానుల మధ్య అట్టహాసంగా నిర్వహించారు. బాలానగర్ మండల కేంద్రంతో పాటు జాతీయ రహదారిపై ఉన్న కేతిరెడ్డిపల్లి, రాజాపూర్ మండల కేంద్రంలో ఆయనకు అభిమానులు భారీ సంఖ్యలో స్వాగతం పలికి కేక్ కట్ చేశారు. రాజాపూర్ మండల కేంద్రంలోని జీకే గార్డెన్‌లో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అనంతరం ఇతర గ్రామాల నుంచి రాజాపూర్, బాలానగర్ మండలాలకు చదువుకునేందుకు వస్తున్న పేద విద్యార్థులకు ఉచితంగా సైకిళ్ల పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు హతిరాం, శ్రీశైలంయాదవ్, బచ్చిరెడ్డి, శేఖర్‌గౌడ్, అచ్చయ్య, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లు ఏకం కావాలి



ధర్మాపూర్ గ్రామ కమిటీ సభ్యులు

జెడ్పీసెంటర్(మహబూబ్‌నగర్): బీసీ జనాభాలో సగభాగం ఉన్న ముదిరాజ్‌లు ఏకం కావాలని తెలంగాణ ముదిరాజ్ మహాసభ జిల్లా అధ్యక్షుడు మెట్టుకాడి ప్రభాకర్ అన్నారు. బుధవారం మహబూబ్‌నగర్ మండల కేంద్రంలో జరిగిన కార్యవర్గ సమావేశంలో ఆయన మాట్లాడారు. మనమందరం ఐకమత్యంతో కలిసి ఉంటే ఏదైనా సాధించగలుగుతామన్నారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో అత్యధిక స్థానిక సంస్థ ప్రజా ప్రతినిధులుగా ఎన్నిక కావాలంటే మనమందరం ఐకమత్యంతో కలిసి మెలిసి నడవాల్సిన అవసరం ఉందన్నారు. అనంతరం ధర్మపూర్ గ్రామ కమిటీని ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా బోల నర్సింహులు, అధ్యక్షుడిగా పసుల మాధవులు, ప్రధాన కార్యదర్శిగా వాకిటి శేఖర్, ఉపాధ్యక్షులుగా నరేందర్, సంయుక్త కార్యదర్శిగా వెంకట్ రాములు, రాములు, కోశాధికారిగా నరేష్, కార్యవర్గ సభ్యులుగా శేఖర్, రాజు తదితరులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు చంద్రుడు, మండల ప్రచార కార్యదర్శి వెంకట్ రాములు, ముదిరాజ్ నాయకులు బోల యాదయ్య, పోలీస్ నాగరాజు, గూడెం యాదయ్య, పోలీస్ కుమారస్వామి, వాకిటి జంగయ్య, పసుల నరేందర్, ఆలూరి ఆంజనేయులు, వాకిటి దయాకర్, బక్కి ఎంకన్న, బక్కి శ్రీనివాసులు, పోలీస్ వినోబా పాల్గొన్నారు.

పూలు, పండ్ల బండ్లను తొలగించాలి



చిరు వ్యాపారులతో మాట్లాడుతున్న ఆర్టీసీ డీఎం సుజాత

మహబూబ్‌నగర్ మున్సిపాలిటీ: స్థానిక కొత్త బస్టాండుకు ఎదురుగా కొత్తగా నిర్మించిన దుకాణాలకు ఎవరూ ఆటంకం కల్పించవద్దని టీజీఆర్టీసీ మహబూబ్‌నగర్ డీఎం సూజత సూచించారు. ఈపాటికే అక్కడ ఉన్న పూలు, పండ్లబండ్లను ఈనెల 25వ తేదీలోగా తొలగించుకోవాలని చిరు వ్యాపారులను ఆదేశించారు. ఈ మేరకు బుధవారం వారిని తన చాంబర్‌కు పిలిపించి నోటీసులు జారీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కొత్త షాపులను అద్దెకు తీసుకున్న వారు త్వరలోనే తమ వ్యాపారాలు ప్రారంభించేందుకు వీలుగా ఎదురుగా ఉన్న ఈ పండ్ల బండ్లను మరో చోటకు తరలించాల్సి ఉంటుందన్నారు. ఇందుకు సంబంధించిన ఫ్లెక్సీలను కొత్త షాపులకు డీఎం పేరిట అతికించారు.

ఆకట్టుకున్న మాతృమూర్తుల పాదపూజ



తల్లులకు పాదపూజ చేస్తున్న విద్యార్థులు

నవాబుపేట: విద్యాసంవత్సరం చివరిరోజు ప్రభుత్వ పాఠశాలలో మాతృమూర్తుల పాదపూజ కార్యక్రమం ఆకట్టుకుంది. బుధవారం కాకర్లపహాడ్ ప్రాథమిక పాఠశాలలో విద్యా సంవత్సరం ముగింపు సందర్భంగా విద్యార్థుల తల్లులకు పాదపూజ కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంపై మండల అధికారులు, ప్రజాప్రతినిధులు పాఠశాల అధ్యాపక బృందాన్ని అభినందించారు.

పాఠశాల కరపత్రం విడదల

కాకర్లపహాడ్ పాఠశాల విద్యార్థుల ప్రతిభ, పాఠశాల అభివృద్ధిపై ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన కరపత్రాన్ని కాంగ్రెస్ నాయకుడు దుశ్యంత్‌రెడ్డి విడుదల చేశారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎం దశరత్‌నాయక్, పాఠశాల అధ్యాపకులు విజయ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.